సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం ၊ 23 ၊ సెప్టెంబర్ ၊ 2025



ఉత్సవాలకు అంకురార్పణ

అలంపూర్‌లోని జోగుళాంబ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభించారు.

-IIలో ▸



జూరాలకు పోటెత్తిన వరద

ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో జూరాల ప్రాజెక్టుకు 2,82,000 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది.

-IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.8 /21.4

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజావాణి ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రజల నుంచి 25 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 14..



కందనూలు: పోలీస్ ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. సోమవారం పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో 10 భూ తగాదాలు, నాలుగు ఇతర ఫిర్యాదులు ఉన్నాయి. వాటి పరిష్కారం కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపినట్లు ఎస్పీ చెప్పారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



నాగర్‌కర్నూల్ రూరల్: కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీని పూర్తిగా అమలు చేయాలని, అలాగే జాబ్ క్యాలెండర్ ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను భర్తీ చేసి, నిరుద్యోగ యవతకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శివశంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.4 వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌పరం చేసే ఆలోచన విరమించుకోవాలని అన్నారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకపోతే ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివవర్మ, జిల్లా కార్యదర్శి మధు, సహాయ కార్యదర్శి రవి, నాయకులు కుర్మయ్య, మల్లికార్జున్, బీరయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

గద్వాల వ్యవసాయం: రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతికి అనుగుణంగా పంటలు పండించడం ద్వార దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందవచ్చునని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం గద్వాలలోని బ్రహ్మకుమారీస్ అమృత కుంజు భవనంలో ప్రపంచ సేంద్రియ వ్యవసాయ సాగు దినోత్సవాన్ని నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వాడకం వల్ల నేల, నీరు, పర్యావరణం కలుషితమవుతాయన్నారు. రసాయనిక మందుల వాడకం తగ్గించడం వల్ల జీవ వైవిధ్యాన్ని పెంచవచ్చునన్నారు. సేంద్రియ పద్ధతుల్లో పండిన ఆహారంలో పోషక విలువలు అధికంగా ఉంటాయన్నారు. వ్యవసాయంలో పాడి పంటలను కలిపి నిర్వహించడం ద్వార ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చునని చెప్పారు. రైతులు దేశీయ ఆవులను పెంచాలని సూచించారు. వీటి పాల ద్వార చేసే ఉత్పత్తులు మానవాళి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. వర్మీ కంపోస్ట్ సులభంగా తయారు చేసుకోవచ్చునని వివరాలు ఆయన తెలియజేశారు. పంటల మార్పిడి విధానాలు పాటించాలని సూచించారు.

రామన్‌పాడులో 1,021 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా.. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875, కుడి, ఎడమ కాల్వలకు 55, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

స్థానిక పోరుకు సన్నద్ధం

ప్రాదేశిక, పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారుల కసరత్తు

- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల
- కీలకంగా మారనున్న కేటాయింపు ప్రక్రియ
- కలెక్టర్, ఆర్డీఓ, ఎంపీడీఓలకు బాధ్యతల అప్పగింత



సాక్షి, నాగర్‌కర్నూల్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఎన్నికల నిర్వహణలో కీలకమైన రిజర్వేషన్ల కేటాయింపుపై అధికారులకు మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా రిజర్వేషన్ల ప్రక్రియపై కీలకమైన బాధ్యతలను కలెక్టర్, ఆర్డీఓ, ఎంపీడీఓ స్థాయి అధికారులకు అప్పగించింది. రిజర్వేషన్ల ప్రక్రియపై మార్గదర్శకాల నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాజకీయ కోలాహలం నెలకొంది. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లో 77 జెడ్పీటీసీ, 802 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. 1,705 గ్రామ పంచాయతీలు, 15,322 వార్డు స్థానాలు ఉన్నాయి.

బీసీ కులగణన ఆధారంగా..

ప్రభుత్వం ఇప్పటికే చేపట్టిన బీసీ కులగణన ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లను కేటాయించాలని నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులగణన సర్వేను అనుసరించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించనున్నారు. ఫలితంగా గత ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలతోపాటు అదనంగా మరికొన్ని స్థానాలు పెరగనున్నాయి. అలాగే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు ఎప్పటిలాగే కొనసాగుతాయి. ఈ క్రమంలో జనరల్ కేటగిరి స్థానాలు తగ్గే అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించే రిజర్వేషన్ స్థానాల్లో 50 శాతం స్థానాలను మహిళలకు దక్కనున్నాయి. షెడ్యూల్డ్, ఏజెన్సీ ఏరియాలో ఎంపీటీసీ, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎస్టీ జనాభాలో 50 శాతం తగ్గకుండా చూస్తారు. అలాగే ఎస్టీ నోటిఫైడ్ గ్రామాల్లో సర్పంచులు, వార్డుమెంబర్ పదవులను పూర్తిగా వారికే కేటాయించనున్నారు. ఎన్నికల నిర్వహణలో కీలకమైన రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఎన్నికల నిర్వహణపై ఆశలు నెలకొన్నాయి.

ఉమ్మడి జిల్లాలో పంచాయతీలు, వార్డుల వివరాలు

జిల్లా	గ్రా.పం	వార్డులు
నాగర్‌కర్నూల్	461	4,140
మహబూబ్‌నగర్	441	3,838
నారాయణపేట	280	2,518
వనపర్తి	268	2,436
జో.గద్వాల	255	2,390

గ్రా.పం: గ్రామ పంచాయతీలు

జెడ్పీటీసీ, ఎంపీటీసీలు స్థానాలు ఇలా..

జిల్లా	జెడ్పీటీసీ	ఎంపీటీసీ
నాగర్‌కర్నూల్	20	214
మహబూబ్‌నగర్	16	175
వనపర్తి	15	136
జోగులాంబ గద్వాల	13	141
నారాయణపేట	13	136

రెండు రోజుల్లోనే ప్రక్రియ..

గ్రామ పంచాయతీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు రిజర్వేషన్లను కేటాయించే బాధ్యతలను ప్రభుత్వం సంబంధిత అధికారులకు అప్పగించింది. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు కేవలం రెండు రోజుల్లోనే రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఇప్పటికే కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, జెడ్పీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. జెడ్పీ చైర్మన్ స్థానాల రిజర్వేషన్లను రాష్ట్రస్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ ఖరారు చేయనున్నారు. అలాగే జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లను కలెక్టర్ కేటాయించనున్నారు. ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను ఆర్డీఓ ఖరారు చేయనుండగా.. గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఆయా మండలాల ఎంపీడీఓలు కేటాయించనున్నారు.

➪ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా తుది ఓటరు జాబితా పూర్తయ్యింది. ఎన్నికల సంఘం ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా ఎన్నికలను నిర్వహించేందుకు వీలుగా ఇప్పటికే కసరత్తు పూర్తయ్యింది. ఓటరు జాబితాతోపాటు పోలింగ్ కేంద్రాల గుర్తింపు, మ్యాపింగ్ పూర్తి కాగా.. బ్యాలెట్ బాక్సులతోపాటు బ్యాలెట్ పేపర్ ముద్రణకు అనుగుణంగా సిద్ధంగా ఉంచారు. ఎన్నికల సిబ్బందికి పలు దఫాలుగా శిక్షణ సైతం ఇచ్చారు.

పార్టీల వ్యూహ, ప్రతివ్యూహాలు

దసరా పండగ తర్వాత ఏ క్షణంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందన్న అంచనాలతో ప్రధాన రాజకీయ పార్టీలు తమ వ్యూహ, ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇప్పటికే అధికార కాంగ్రెస్ నియోజకవర్గాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తదే భవిష్యత్ అంటూ వారికి భరోసా కల్పిస్తోంది. ముందుగానే హామీ ఇచ్చినట్టుగా బీసీ రిజర్వేషన్ల అమలుతో తమకు కలిసి వస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది. అలాగే ప్రతిపక్ష బీఆర్ఎస్ సైతం ఇప్పటికే విస్తృతంగా పార్టీ సమావేశాలు నిర్వహించింది. ఇప్పటికీ తమ కేడర్ బలంగా ఉందని, రానున్న ఎన్నికల్లో సత్తాచాటాలని భావిస్తోంది. బీజేపీ సైతం రాష్ట్రస్థాయిలో సమావేశాలు నిర్వహించగా.. క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంది. ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు ఆయా పార్టీలు వ్యూహ రచన చేస్తున్నాయి.

జగన్మాతకు జేజేలు

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- జిల్లాకేంద్రంలో ఆకట్టుకున్న విగ్రహ శోభాయాత్ర
- మొదటిరోజు నిజరూపంలో దర్శనమిచ్చిన వాసవీమాత



నిజరూప అవతారంలో వాసవీమాత అమ్మవారు

కందనూలు: జగన్మాతకు జేజేలు.. పాహిమాం పరమేశ్వరీ.. దుర్గమ్మా.. కరుణించమ్మా అంటూ భక్తుల నినాదాలతో జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలు, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో జగన్మాతను కొలువుదీర్చి వివిధ రూపాల్లో అలంకరించారు. ఈ క్రమంలో జిల్లాకేంద్రంలో 55వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఉత్సవ విగ్రహ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. కోలాటాలు, చెక్క భజనలు, సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపు సాగింది. ఆలయ అర్చకులు జోషి పాండురంగ శర్మ ధ్వజారోహణం, గణపతి, గోపూజ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా.. మొదటిరోజు అమ్మవారు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.



జిల్లాకేంద్రంలో అమ్మవారి విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న మహిళా భక్తులు

'పాలమూరు' నీళ్లను డిండికి తరలిస్తే ఊరుకోం



డిండికి నీళ్లు తరలించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోడేరు: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి నల్లగొండ జిల్లా డిండికి నీళ్లను తరలిస్తే అడ్డుకుంటామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం శశిధర్ రెడ్డి అన్నారు. మండలంలోని తీగలపల్లిలో జరుగుతున్న పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో సుమారు 36 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా కేవలం 5- 6 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందిస్తున్నారని ఆరోపించారు. నల్లగొండ జిల్లాలో డిండి ప్రాజెక్టు ద్వారా 12 లక్షల ఎకరాలకు గాను 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారన్నారు. కేవలం 2 లక్షల ఎకరాల కోసం పాలమూరు జిల్లాను ఎడారి చేయడానికి కుట్ర చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికే కేఎల్ఐ, పాలమూరు ఎత్తిపోతలు, మిషన్ భగీరథ పథకంలో దాదాపు 40 శాతం మంది రైతులు భూములు నష్టపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాలమూరు నుంచి నీటిని తరలించడానికి సన్నాహాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి నుంచి కాకుండా శ్రీశైలం నుంచి నీళ్లు తీసుకెళ్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అర్థం రవి, బాలగౌడ్, శంకర్, భీముడు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



నూతన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: సమస్యల సాధన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. సోమవారం అచ్చంపేటలోని టీఎన్‌జీఓ భవనంలో రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అధ్యక్షతన డివిజన్ స్థాయి నల్లమల నగర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ నల్లమల పాదయాత్రలో మేనిఫెస్టోలో ప్రకటించిన పాతపెన్షన్‌ను ప్రభుత్వం పునరుద్ధరించాలన్నారు. ఇప్పటికే సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించుకున్నామని, ఇక సర్వీస్ పెన్షన్ కోసం ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలన్నారు. అనంతరం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కమిటీలను ప్రకటించారు. రాష్ట్ర కార్యదర్శిగా గోపాల్, జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, అచ్చంపేట డివిజన్ నూతన గౌరవాధ్యక్షుడిగా మారేడి కుమార్, అధ్యక్షుడిగా తేజనాయక్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా సూర్య, ఉపాధ్యక్షుడిగా చెన్నకేశవులు, అచ్చంపేట మండల అధ్యక్షుడిగా హనుమానాయక్, లింగాల మండల అధ్యక్ష, కార్యదర్శులుగా రాంలాల్‌నాయక్, వెంకటేశ్వర్లు, ఉప్పునుంతల అధ్యక్షుడిగా భూపతికుమార్, బల్మూర్ అధ్యక్షుడిగా లోకేష్‌ను ఎన్నుకున్నారు.

నెలాఖరులోగా భూ సేకరణ పూర్తి చేస్తాం



వీసీలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు

నాగర్‌కర్నూల్: జాతీయ రహదారులకు అవసరమైన భూ సేకరణను ఈనెలాఖరులోగా పూర్తి చేస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులకు అవసరమైన స్థల సేకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. కాగా.. జిల్లా నుంచి వీసీలో కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి భూసేకరణలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. సమావేశంలో జాతీయ రహదారుల ఈఈ సురేందర్, ఆర్డీఓలు సురేష్, భన్సీలాల్, జనార్దన్‌రెడ్డి, డీఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కల్వకుర్తి టౌన్: డిపో పరిధిలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం సుభాషిణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు, ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారులు సలహాలు, సూచనలు ఉంటే తెలియజేయాలని ఆమె కోరారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు సెల్ నం.99592 26292కు ఫోన్ చేయాలని ఆమె సూచించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

కందనూలు: జిల్లాకేంద్రంలో ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పదో తరగతికి సంబంధించి జిల్లాకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ (బాలికలు), ఇంటర్‌కు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు సోమవారం నుంచి శుక్రవారం వరకు కొనసాగనున్నాయి. కాగా.. జిల్లా వ్యాప్తంగా పదో తరగతికి సంబంధించి 174 మంది, ఇంటర్మీడియట్‌కు సంబంధించి 281 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఓపెన్ స్కూల్ పరీక్షల కోఆర్డినేటర్ శివప్రసాద్ తెలిపారు.

నడినెత్తిపై ముప్పే

ప్రమాదకరంగా టీవీ, ఇంటర్నెట్, టెలిఫోన్ కేబుళ్లు

- జిల్లావ్యాప్తంగా తొలగింపునకు కసరత్తు
- ముందస్తుగా కేబుల్ ఆపరేటర్లకు హెచ్చరికలు
- ప్రమాదాల నివారణ కోసం విద్యుత్ శాఖ చర్యలు
- ఇప్పటికే ప్రమాదకరంగా ఉన్న తీగల తొలగింపు

అచ్చంపేట రూరల్: జిల్లాలోని నాలుగు డివిజన్ పరిధిలోని పట్టణాల్లో విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేస్తున్న కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్, టెలిఫోన్ల వైర్లు ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ స్తంభాలపై కేవలం నాలుగు వరుసలతో మాత్రమే కరెంటు తీగలు ఉంటే.. ఆ స్తంభాలపై 20 నుంచి 30 వరుసలతో కూడిన కేబుల్ వైర్లు వేలాడుతూ కనిపిస్తున్నాయి. దీంతో పట్టణ ప్రజలతోపాటు ఆయా ప్రాంతాల్లోని కాలనీల ప్రజలు, వ్యాపారులు తరచూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి దుమారానికి విద్యుత్ తీగలు తగిలినప్పుడు మెరుపులు వచ్చి అవి కేబుళ్ల మీద పడి మంటలు వస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు ప్రధాన రహదారుల మీదే జరుగుతుండటంతో వాహనదారులు, పాదచారులు నిత్యం భయాందోళనలకు గురవుతున్నారు.



అచ్చంపేటలో ఓ విద్యుత్ స్తంభానికి గజిబిజిగా ఉన్న కేబుళ్లు

సమన్వయం కరువు..

జిల్లాలోని అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి పట్టణాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ పూర్తిగా ప్రైవేట్ సంస్థల పరిధిలోనే ఉంది. కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్, టెలిఫోన్ సర్వీసు ప్రొవైడర్లు ఎవరికి వారుగా తమకు కంపెనీకి చెందిన 10 నుంచి 20 తీగలను విద్యుత్ స్తంభాలకు వేలాడదీస్తూ ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయంలో మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి అభ్యంతరాలు చెప్పకపోవడంతో ఇష్టారాజ్యంగా కేబుళ్లు ఏర్పాటు చేసుకున్నారు.

అనుమతి తప్పనిసరి..

విద్యుత్ శాఖకు చెందిన స్తంభాలపై కేబుళ్లు ఏర్పాటు చేసేందుకు ఆ శాఖ నుంచి అనుమతి కూడా తీసుకోవడం లేదు. అదేవిధంగా మున్సిపల్ అధికారులు సైతం ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో కేబుళ్లు విపరీతంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయంలో సమన్వయంతో వ్యవహరించాల్సిన ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.



నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో తొలగించిన కేబుళ్లు

అక్రమంగానే విద్యుత్ వినియోగం..

ఇంటర్నెట్, కేబుల్ తీగలు వేయడానికి స్తంభాలను ఉపయోగించినప్పుడు విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలి. ఒక్కో స్తంభానికి గ్రామీణ ప్రాంతంలో రూ.15, పట్టణాల్లో రూ.20 చెల్లించాలి. కానీ, ఇది ఎక్కడా అమలు కావడం లేదు. కేబుల్ తీగలకు కావాల్సిన విద్యుత్‌ను అక్రమంగానే వినియోగిస్తున్నారు. అక్రమంగా విద్యుత్ వినియోగంతో టీవీలకు వచ్చే కేబుల్ వైర్లకు ఒక్కోసారి విద్యుత్ సరఫరా జరుగుతుంది. జిల్లాలో ఎక్కడ చూసినా విద్యుత్ స్తంభాల నుంచి కేబుల్, ఇంటర్నెట్ వైర్లు వేలాడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ప్రమాదాలు జిల్లాలో జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

మరమ్మతుకు తిప్పలు..

విద్యుత్ సిబ్బంది స్తంభాలను ఎక్కి మరమ్మతు చేయాల్సి వచ్చినప్పుడు కుప్పలు తెప్పలుగా ఉంటున్న కేబుల్ తీగలు అడ్డంకిగా మారుతున్నాయి. భారీ క్రేన్లను తెప్పించి కేబుళ్లు తగలకుండా పనులు చేయాల్సి వస్తోందని, అయినా ఆ సమయంలో అవి తమ క్రేన్లకు అడ్డుగా వస్తున్నాయని విద్యుత్ శాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. దీనికితోడు భారీ వాహనాలు వెళ్లినప్పుడు కిందకు వేలాడుతున్న కేబుళ్లు తెగి.. విద్యుత్ వైర్లకు తాకి.. మెరుపులు కూడా వస్తున్నాయి. దీంతో ఆ మార్గంలో వెళ్లే వారు కేబుళ్లు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు.

> **ప్రమాదాలు జరగకుండా చర్యలు..**
>
> జిల్లాలో ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కేబుల్ ఆపరేటర్లకు ఇప్పటికే సమాచారం ఇచ్చాం. 15 మీటర్ల ఎత్తులో కేబుళ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు. జిల్లాలోని నాలుగు డివిజన్ల పరిధిలో ప్రమాదకరంగా ఉన్న కేబుళ్ల తొలగించాం. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాల్సిందే.
>
> – నర్సింహారెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ

నిబంధనలకు పాతర..

విద్యుత్ స్తంభాలకు ఇంటర్నెట్, టీవీ కేబుల్ తీగలు ప్రమాదానికి కారణమవుతున్నాయి. తీగలను ఇష్టానుసారంగా వదిలివేయడంతో ప్రమాదం ఎప్పుడు ఎలా పొంచి ఉందో తెలియడం లేదు. చాలాచోట్ల తీగలు నేలపై పడి ఉండటం, నడుచుకుంటూ వెళ్తుంటే తలకు తాకేలా వదిలేస్తున్నారు. నిబంధనల ప్రకారం 18 అడుగుల ఎత్తుకు పైగా వీటిని ఏర్పాటు చేయాలి. కానీ, స్తంభాలకు ఇబ్బడిముబ్బడిగా ముడిపెట్టి తక్కువ ఎత్తులో తీగలు ఉంచడంతో కిందికి వేలాడుతున్నాయి. ఇవి తెగి విద్యుత్ తీగలపై పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.



అలంపూర్‌లో జోగుళాంబ దీక్ష స్వీకరిస్తున్న భక్తులు



అమ్మవారి అలంకరణ



జోగుళాంబ ఆలయంలో హారతి అందుకుంటున్న భక్తులు

ఉత్సవాలకు అంకురార్పణ



ఉత్సవాల్లో పూజలు నిర్వహిస్తున్న ఈఓ దీప్తి

- అలంపూర్‌లో అట్టహాసంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- వేదమంత్రాలతో మార్మోగిన ఆలయాలు
- భారీగా తరలి వచ్చిన భక్తులు

అలంపూర్: అలంపూర్ క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలకు సోమవారం అంకుర్పారణ చేశారు. జోగుళాంబ అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవోపేతంగా ప్రారంభించారు. సంప్రదాయానికి స్వాగతం పలుకతూ ఈఓ దీప్తి, పాలక మండలి సభ్యులు అర్చక స్వాములతో కలిసి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. అమ్మవారి ఆలయం అర్చక స్వాములు ఈఓతో కలిసి మంగళవాయిద్యాలు, పట్టువస్త్రాలతో బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ స్వామివారి అనతీ స్వీకరణ పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ బలిభేరీ తీసుకొని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం తరఫున పట్టువస్త్రాలు, మంగళ ద్రవ్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా యాగశాల ప్రదక్షిణ, ప్రవేశం, మహా గణపతిపూజ, పుణ్యాహవచనం, ఋత్విక్ వరణ, రక్షాబంధనం, మహా కలశస్థాపన, అగ్నిముఖం చేశారు. యాగశాలలో చండీ హోమం, సహస్రనామార్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నవాన్న సహిత మహానివేదన, బలిహరణ సమర్పణ కార్యక్రమాలు కొనసాగాయి. మృతసంగ్రహణంలో భాగంగా స్వామివారి ఉద్యానవనంలో పట్టుమట్టికి పూజలు చేశారు. అనంతరం మహిళలు పుట్టమట్టిని మంగళవాయిద్యాల మధ్య యాగశాలకు చేర్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నాగశిరోమణి, సరస్వతి, జగదీశ్వర్ గౌడ్, గోపాల్, జగన్‌మోహన్ నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, అడ్డాకుల వెంకటేశ్వర్లు, పులేందర్, సురేందర్ స్వామి, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు, ఎక్స్‌అఫీషియో సభ్యులు ఆనంద్ శర్మ, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దేవతలకు ఆవాహనం పలుకుతూ..

దేవీశరన్న నవరాత్రిని పురస్కరించుకొని ఆలయాల్లో జరిగే ఉత్సవాలకు ప్రతీకగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా అమ్మవారి ఆలయంలో ధ్వజారోహణం చేశారు. శక్తిని ప్రేరేపించేందుకు దేవతలకు ఆవాహనం పలుకుతూ ఉత్సవానికి గుర్తుగా ధ్వజాన్ని ఆరోహణ చేస్తారని అర్చక స్వాములు తెలిపారు. ఎమ్మెల్యే విజయుడు హాజరై అర్చకస్వాములతో కలిసి ధ్వజారోహణం చేశారు. అంతకుముందు ఈఓ దీప్తి అర్చకులతో కలిసి స్వాగతం పలికారు.

శైలపుత్రిగా జోగుళాంబ దేవి

అష్టాదశ శక్తి పీఠాల్లో ఐదో శక్తి పీఠంలో శరన్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జోగుళాంబ అమ్మవారు సోమవారం శైలపుత్రి మాతగా భక్తులకు దర్శనమిచ్చి విశేష పూజలందుకున్నారు. మొదటిరోజు సువాసినీ, కుమారి పూజలు చేశారు.



అమ్మవారి ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు

వైభవంగా నిర్వహిస్తాం: ఈఓ

జోగుళాంబ అమ్మవారి దేవీశరన్న నవరాత్రి ఉత్సవాలను నయనానందంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహన అధికారిణి దీప్తి పేర్కొన్నారు. అలంపూర్ క్షేత్రంలోని కార్యాలయంలో ఈఓ సోమవారం దేవీశరన్న నవరాత్రి ఉత్సవాలపై మాట్లాడారు. జోగుళాంబ అమ్మ వారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైనట్లు తెలిపారు. అమ్మవారు నవరాత్రులు నవరూపాల్లో దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. 10వ రోజు జోగుళాంబ మాతగా దర్శనమిస్తారన్నారు. భక్తులు, వీఐపీలకు ప్ర త్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సాధారణ భక్తులకు ప్రతిరోజూ మధ్యాహ్నం 2:30గంటల నుంచి 3:30 గంటల వరకు ఎలాంటి రుసుము లేకుండా కుంకుమార్చనలకు ప్రత్యేక సదుపాయం కల్పించినట్లు తెలిపారు. సాయంత్రం 5గంటల నుంచి 7గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. గద్వాల సంస్థానదీశులు అందజేసిన చీరలతో తొమ్మిది రోజులు ప్రత్యేకంగా అలంకరణ చేయనున్నట్లు తెలిపారు. శని, ఆదివారాల్లో సాయంత్నం 5గంటల నుంచి 7గంటల వరకు సాంస్కృతిక సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు.

మళ్లీ పోటెత్తిన వరద



జూరాల నుంచి దిగువకు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

- జూరాల ప్రాజెక్టు 37గేట్ల ద్వారా దిగువకు నీటివిడుదల
- ఇన్‌ఫ్లో 2.82 లక్షలు, అవుట్ ఫ్లో 2.89లక్షల క్యూసెక్కులు
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు: కర్ణాటక, మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీ ఎత్తున వరద వచ్చి చేరుతుందని పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి 8గంటల వరకు ప్రాజెక్టుకు 2లక్షల 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సోమవారం రాత్రి 8గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లోలు 2లక్షల 82వేల క్యూసెక్కులకు పెరిగినట్లు పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు 37గేట్లను ఎత్తి 2. 56లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 29, 075 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 390 క్యూసెక్కులు, కుడి కాల్వవకు 560 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 2, 89, 434 క్యూసెక్కుల నీటిని దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.551 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఎగువనున్న నారాయణపూర్ ప్రాజెక్టుకు పూర్తిస్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 32.98 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 80వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 15గేట్లను ఎత్తి దిగువనున్న జూరాలకు 75, 600 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

726.371 ఎంయూల విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నీరు భారీగా చేరుతుండడంతో జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. ఈ మేరకు సోమవారం 6 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, 355.509 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 726.371 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. జూరాలకు అత్యధికంగా వరద చేరుతుండడంతో దిగువ ఉత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తి చేపట్టలేక పోయామని వివరించారు.

కోయిల్‌సాగర్ 6 గేట్ల ద్వారా నీటివిడుదల

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు భారీగా వరద జలాలు వచ్చి ప్రాజెక్టులో చేరుతుండడంతో సోమవారం 6గేట్లను రెండు అడుగుల మేర తెరిచి 4200 క్యూసెక్కుల నీటిని వాగులోకి వదిలారు. కోస్గి, కొడంగల్, దౌల్తాబాద్, వరిగి తదితర ప్రాంతాల్లో భారీగా కురిసిన వర్షాలకు పెద్దవాగు ప్రవహం ఉరకలు వేస్తున్నది. శనివారం మూడు గేట్లను తెరువగా ఆదివారం ఒకగేటును తెరిచి నీటిని వదిలారు. సోమవారం ఏకంగా 6గేట్లను తెరవడం ఈ ఏడాది ఇదే మొదటిసారి. ఆగస్టు నుంచి వరద ప్రవాహం పెరిగినప్పుడల్లా తరచూ గేట్లను తెరిచి నీటిని వదులుతున్నారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. పెద్దవాగు ప్రవాహం పెద్ద ఎత్తున తరలి రావడంతో ప్రాజెక్టులో నీటిమట్టం గణనీయంగా పెరగడం ప్రారంభమైంది. అప్రమత్తమైన అధికారులు ఆరుగేట్లను తెరిచారు. ప్రస్తుతం పైనుంచి వస్తున్న ఇన్‌ఫ్లోకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తున్నారు.



బందర్‌పల్లి వద్ద ఉరకలు వేస్తున్న చెక్‌డ్యామ్

కోయిల్‌సాగర్ 6గేట్లను తెరవడంతో దిగువ ప్రాంతంలోకి వాగు ఉరకలు వేస్తున్నది. బందర్‌పల్లి వద్ద పాత వంతెనపై నిర్మించిన చెక్‌డ్యామ్ ఉప్పొంగుతున్నది. కొత్త వంతెన కింద నుంచి భారీగా వాగు ప్రవాహం రావడంతో పలువురు వాహనదారులు వాహనాలను నిలిపి నీటి ప్రవాహాన్ని చూస్తూ కనిపించారు.

క్లుప్తంగా

మార్కెట్‌లోకి హీరో గ్లామర్ ఎక్స్ 125



పాలమూరు: హీరో కంపెనీ నుంచి మరో అత్యాధునిక మోడల్స్‌లో రెండు రకాల బైకులు మార్కెట్‌లోకి వచ్చాయి. కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన హీరో గ్లామర్ ఎక్స్ 125 సీసీ బైక్, హీరో జూమ్ 160స్కూటీలను సోమవారం జిల్లా కేంద్రంలోని ఏనుగొండ హీరో షోరూంలో మైనార్టీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, హీరో షోరూం ఎండీ దిలీప్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎండీ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. అత్యాధునిక ప్రపంచంలో ఈ నూతన మోడల్స్ రైడ్ బై వైర్–కిక్ స్టార్ట్ విత్ రైడ్‌బై వైర్ అనుభూతి ఇస్తుందన్నారు. వినియోగదారుల అవసరానికి అనుగుణంగా దీంట్లో ఈకో, రోడ్, పవర్ మోడ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ మోడల్ నాలుగు రంగుల్లో లభిస్తుందని ఎక్స్ షోరూం ధర డ్రమ్ రూ.84, 809, డిస్క్ రూ.92, 183 లభిస్తున్నట్లు తెలిపారు. ఇక స్కూటీలో జూమ్ 160లో శక్తివంతమైన 160సీసీ లిక్విడ్ కూల్ ఇంజిన్, కటింగ్ ఏడ్జ్, ఐ 3 ఎస్ స్మార్ట్ సైలెంట్ సాంకేతిక కలిగి ఉంటుందన్నారు. డిజిటల్ స్పీడో మీటర్ బ్లూటూత్, నావిగేషన్ వసతి ఉందన్నారు. ఈ మోడల్ నాలుగు రంగుల్లో రూ.1,36,898కు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కంపెనీ సెల్స్ ఆఫీసర్ రిషబ్, మురళి, బాలరాజుగౌడ్, రమేశ్, సిద్దేశ్వర్, చారి పాల్గొన్నారు.

కూతురును కామెంట్ చేసిన యువకుడిపై తండ్రి దాడి



జడ్చర్ల: తన కూతురును తప్పుగా కామెంట్ చేసిన ఓ యువకుడిపై తండ్రి మందలించి చేయి చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న యువకుడి కు టుంబ సభ్యులు కర్రలతో యువతి తండ్రితోపాటు అడ్డుకోబోయిన మరో వ్యక్తిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం జడ్చర్లలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం .. పట్టణంలోని గౌరీశంకర్‌కాలనీలో నివాసం ఉంటున్న గ్యాబ్రియల్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఇంట్లోకి వస్తున్న తన కూతురును ఎదురుగా ఉన్న ఓ హోటల్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కృష్ణారెడ్డి అనే యువకుడు తప్పుగా ప్రవర్తించాడు. దీంతో విషయం తెలుసుకున్న తండ్రి హోటల్‌కి వెళ్లి యువకుడిని మందలించడంతోపా టు చేయి చేసుకున్నాడు. దీంతో స్వల్పంగా గాయపడిన యువకుడి ఫొటోలు వాట్సాప్‌లో చూసిన కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చి గ్యాబ్రియల్‌పై ఎదురుదాడికి పాల్పడ్డారు. దాడిని అడ్డుకోబోయిన పారుగింటికి చెందిన జనార్దన్‌పై కూడా కర్రలతో దాడి చేయడంతో గ్యాబ్రియర్, జనార్దన్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

ఒక్క సీసీ కెమెరా వంద కళ్లతో సమానం

- జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

మహమ్మదాబాద్: ఒక్క సీసీ కెమెరా వంద కళ్లు చేసేపని చేస్తున్నదని.. ముఖ్యమైన స్థలాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని.. ఉండి పని చేయని వాటిని పురుద్ధరించుకోవాలని జోగుళాంబజోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ పేర్కొన్నారు. సోమవారం మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లో నిఘా పెంచాలని సూచించారు. అన్ని పార్టీల నాయకులతో మమేకమై అల్లర్లు సృష్టించే వారిని అదుపులోకి తీసుకుని పాత నేరస్తులను బైండోవర్ చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో పెండింగులో ఉన్న కేసుల వివరాలు, రికార్డులను తనిఖీ చేశారు. మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు, బాలలపై నేరాలు, ఘోరాలు జరగకుండా పోక్సో చట్టంపై ప్రజలకు, మైనర్లు హద్దులు మీరి ప్రవర్తించడంపై కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. గతంలో దొంగలు ఇంటి తాళాలు పగల గొట్టి వస్తువులు తీసుకెళ్లేవారని.. ఇప్పట్లో దొంగలు ఎక్కడో ఉండి మన చేతనే ఫోన్‌లాక్‌లు తీయించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలనానరు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారిపై గౌరవమర్యాదలతో వ్యవహరించాలన్నారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి శాంతిభద్రతలు కాపాడేలా ఉండాలని తెలిపారు. అనుమతులతో ఉన్న పనులకు తప్పా.. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. నవరాత్రి ఉత్సవాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ యువతకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని, డీజేలను అనుమతించకూడదని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీనాయక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

పింఛన్లు పెంచేవరకు పోరాటం చేస్తాం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ

కొల్లాపూర్: సామాజిక పింఛన్లు పెంచే వరకు రేవంత్ సర్కారుపై పోరాటం కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ వెల్లడించారు. దివ్యాంగులు, చేయూత పింఛనుదారులతో సోమవారం కొల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మందకృష్ణ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సామాజిక పింఛన్ల పెంపు కూడా ఉందన్నారు. తాము అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేలకు పెంచుతామని రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి 22నెలలు కావస్తున్నా.. ఎందుకు పింఛన్లు పెంచడంలేదని ప్రశ్నించారు. పింఛనుదారులను రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 45లక్షల మంది పింఛన్‌దారులు ఉన్నారని, వారందరికీ పెంచాలని, కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న 10లక్షల మందికి పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదల పక్షాన తాను రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తూ వస్తున్నానని వివరించారు. పింఛన్లు పెంచేవరకు రేవంత్ సర్కారును ప్రశ్నిస్తూనే ఉంటానన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పర వ్యక్తిగత విమర్శలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నాయని, ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో ప్రతిపక్షాలు నిర్లక్ష్యం కనబరుస్తున్నాయన్నారు. సదస్సు ప్రారంభానికి ముందు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాదిగ ఉద్యోగ సంఘాల నాయకులు మందకృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌చారి, బాలకృష్ణ, సంగెం, మద్దిలేటి, కుర్మయ్య, రాములు, చందన్‌గౌడ్, పరమేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

సబ్సిడీ విత్తన బస్తాల లూటీ

దామరగిద్ద: సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తున్న వేరుశనగ విత్తనాలు తమకు అందడం లేదని అసహానానికి గురైన రైతులు లూటీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం స్థానిక విండో కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి మణిచందర్ సమక్షంలో విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులను కంట్రోల్ చేసే విషయమై ఎస్ఐ రాజుతో మాట్లాడేందుకు స్టేషన్‌కు వెళ్లిన సమయంలో రైతులు ఒక్కసారిగా గోడౌన్ తాళాలు పగులగొట్టి వేరుశనగ బస్తాలు ఎత్తుకెళ్లారు. గోడౌన్ వద్దకు చేరుకున్న పోలీసులు రైతులను చెదరగొట్టి గోడౌన్‌ను మూయించారు. 20 కేజీల బస్తాలు దాదాపు 80 ఎత్తుకెళ్ళినట్లు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం రైతు వేదికలో టోకెన్లు అందజేసి విత్తనాలు పంపిణీ చేశారు.



విత్తన బస్తాలను ఎత్తుకెళ్తున్న రైతులు

టీజీపీఎస్సీ మెంబర్‌గా లక్ష్మీకాంత్ రాథోడ్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ కమిషన్ చైర్మన్‌గా పీయూ మాజీ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నారాయణ్‌పేట్ జిల్లా, తిమ్మారెడ్డిపల్లికి చెందిన ఆయన నిజాం కళాశాల ప్రిన్సిపాల్, ఓ యూ పీడీతో 2021–24 మధ్య పీయూకు వీసీతో పాటు వివిధ స్థాయిల్లో బాధ్యతలు నిర్వహించారు. ఈ మేరకు ఆయనను టీజీపీఎస్సీ మెంబర్‌గా ప్ర భుత్వం నియమించడంపై లక్ష్మీకాంత్ రాథోడ్ ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఫోన్ ఇప్పించలేదని యువకుడి ఆత్మహత్య



చరణ్(ఫైల్)

లింగాల: తల్లి సెల్‌ఫోన్ ఇప్పించలేదని క్షణికావేశానికై గురైన యువకుడు ఆత్మహత్యకు పా ల్పడిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చరణ్(18) ఇటీవల జరిగిన గణేశ్ నిమజ్జనంలో ఫోన్ పోగొట్టుకున్నా డు. మరో ఫోన్ ఇప్పించాలని తల్లి గీతను కోరగా.. వేతనం వచ్చిన వెంటనే ఇప్పిస్తానని చెప్పింది. తల్లి మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో పనిచేస్తుంది. ప ని నిమిత్తం నాగర్‌కర్నూల్‌కు వెళ్లగా.. ఇద్దరు అన్నదమ్ములు ఇంటిలోనే ఉన్నారు. ఒక గదిలో తమ్ముడు ఉండగా.. మరో గదిలో ఉన్న చరణ్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి దేవేందర్ ఇదివరకే మృతిచెందాడు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఆటోను ఢీకొట్టిన డీసీఎం



కొత్తకోట రూరల్: ఆటోను డీసీఎం ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కొత్తకోట ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాలు.. అలంపూర్ మండలం సింగవరానికి చెందిన దూదేకుల రహీంబాష జిల్లా కేంద్రంలో ఓ ఇంట్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురితో కలిసి టైల్స్ వర్క్ చేస్తున్నారు. రోజువారీ పనిలో భాగంగా ఆదివారం మదనాపురం మండలం గోవిందహళ్లి(అగ్రారం)లో టైల్స్ వేసేందుకు ఆటోలో వెళ్లి రాత్రి కొత్తకోట సమీపంలో ఓ దాబా వద్ద భోజనం చేసి తిరిగి వనపర్తికి వెళ్తుండగా గుంపుగట్టు సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని డీసీఎం ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో దూదేకుల రహీం బాష(25)కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న మిగిలిన ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టపగలే పది తులాల బంగారం చోరీ

మక్తల్: పట్టపగలు బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ఓ మహిళ నుంచి 10 తులాల బంగారం కొట్టేసిన ఘటన మక్తల్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి కథనం ప్రకారం.. మక్తల్‌కు చెందిన మైమునాబేగం కుటుంబ సభ్యుల్లో ఒకరి పెళ్లి ఉందని కొత్తగా నగలు చేయించాలని ఇంటోల ఉన్న పాత బంగారంతోపాటు రూ.50వేల నగదు తీసుకొని బస్టాండుకు వచ్చింది. నారాయణపేటకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా.. తన వద్ద పర్సును గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బస్సులోకి ఎక్కిన తర్వాత సీటుల్లో కూర్చొని పర్సు చూసుకుంటే కనిపించడంలేదు. పర్సులో 10తులా బంగారంతోపాటు రూ.50వేల నగదు ఉన్నాయని మక్తల్ పోలీసులకు ఫిర్యాదు చేసింద. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బావ, మరదలు మృతి

- కారుపై పడిన మరోకారు
- ఉద్యోగంలో చేరేందుకు వెళ్తూ అనంత లోకాలకు

రాజాపూర్/పాన్‌గల్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరేందుకు విమానాశ్రయానికి కారులో వెళ్తున్న బావ, మరదలిని రోడ్డు ప్రమాదంలో మృత్యువు కాటేసిన ఘటన మండల కేంద్రంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. పూర్తి వివరాలు.. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన బీరం రంజిత్‌కుమార్‌రెడ్డి (35) హైదరాబాద్‌లోని ఓ లిక్కర్ పరిశ్రమలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం పెత్తరామావాస్యకు అత్తగా రి ఊరైన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్‌కు భార్య చైతన్యతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో సోమవారం భార్య సోదరి హారిక(25) బెంగళూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరేందుకు వెళ్లా ల్సి ఉండగా, శంషాబాద్ విమానాశ్రయంలో డ్రాప్ చేస్తానని బావ, మరదలు రెనాల్ట్ కారు నంబర్ టీఎస్ 07ఎఫ్ఎన్ 9768లో బయలుదేరారు. ఉదయం 6 గంటల సమయంలో రాజాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా వీరు ప్రయాణిస్తున్న కారును హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న కియా సెల్టాస్ ఏపీ 39జీఏ 2782 కారు డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుకు ఇవతల వైపు వీరు ప్రయాణిస్తున్న కారుపై పడింది. దీంతో రంజిత్‌కుమార్‌రెడ్డి, హారిక కారులోనే ప్రాణా లు విడిచారు. సంఘటనా స్థలానికి చేరుకున్న బాలానగర్ ఎస్ఐ లెనిన్‌గౌడ్ మృతదేహాలను జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య చైతన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు. సుదర్శన్‌రెడ్డి, రాధమ్మలకు ఒక్కగానొక్క కుమారుడు రంజిత్‌కుమార్‌రెడ్డి, మృతుడి భార్య చైతన్య ప్రస్తుతం గర్భిణిగా ఉండటంతో పాటు 18 నెలల కుమార్తె ఉంది.



ప్రమాదస్థలంలో దెబ్బతిన్న కారు



హారిక(ఫైల్)



రంజిత్‌కుమార్ రెడ్డి(ఫైల్)

కోల్డ్ స్టోరేజ్‌లో 72 మిర్చి బస్తాల చోరీ

- రెండు రోజుల్లో నిందితులను పట్టుకున్న పోలీసులు
- పోలీస్‌ల అదుపులో 8మంది : కేసు నమోదు

మానవపాడు: ఆరుగాలం కష్టించి పండించిన పంటను.. కాపాడుకోవడానికి కోల్డ్ స్టోరేజీలో రైతు మిర్చిపంట ఉంచగా.. మిర్చిని సైతం చోరీచేసి దొంగల ముఠా అమ్మే ప్రయత్నం చేసింది. ఈ ఘటన మండలంలోని మానవపాడు నారాయణపురం కోల్డ్ స్టోరేజ్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రకాంత్ కథనం ప్రకారం.. మానవపాడు మండలం నారాయణపురం కోల్డ్ స్టోరేజ్‌లో గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణతో మిర్చి వ్యాపారి తిక్కయ్య మల్దకల్ మండలం ఎల్కూర్‌కు చెందిన వ్యక్తి మిర్చిని అమ్మకాలు జరిపాడు. మిర్చి అమ్మకాలు జరిపి కోల్డ్ స్టోరేజ్ ప్లాట్‌ఫారమ్‌పై 101 సంచులను ఉంచారు. ఈనెల 19వ తేదీన రాత్రి 12గంటల సమయంలో నందు, రాజేశ్, నరేశ్, మంజునాథ్, హన్మంతు, ప్రవీణ్, రాజు, మహేశ్ జాతీయ రహదారి–44పై గేట్ నుంచి డీసీఎం ఉంచి.. తిక్కయ్య వ్యాపారి కొనుగోలు చేసిన 101మిర్చి బస్తాలలో 72 మిర్చి బస్తాలను 8మంది జాతీయ రహదారి గేట్ వైపుగా తీసుకెళ్లి డీసీఎంలో ఉంచారు. ఈనెల 20వ తేదీన 72 బస్తాల మిర్చి డీసీఎంను హైదరాబాద్‌లోని ఔటర్‌రింగ్ రోడ్డు దగ్గర టెంపుల్ వద్ద డీసీఎంను నిలిపి మరో వాహనంలో 25బస్తాలు మలక్‌పేట మిర్చి యార్డుకు తరలించగా.. నారాయణపురం కోల్డ్ స్టోరేజ్ వాళ్లు మలక్‌పేట, గుంటూర్ మిర్చి యార్డుకు ముందుగానే సమాచారం అందించారు. మిర్చి బస్తాల లాట్ నెంబర్లు తెలుపగా వాటిని పట్టుకున్నారు. విషయం తెలిసిన డీసీఎం డ్రైవర్లు నందు, మంజునాథ్ 47సంచులను తీసుకొని తిమ్మాపూర్‌లోని గోల్కొండ వెంచర్‌లో వదిలేసి వెళ్లారు. ఖాళీ డీసీఎంను షాద్‌నగర్‌లో వదిలి ట్రైన్‌లో గద్వాలకు బయలుదేరారు. మానవపాడు ఎస్ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో వారిని పట్టుకొని 50 మిర్చి బస్తాలను రికవరీ చేశారు. ఇంకా 22బస్తాలు రికవరీ కాలేదు. 22బస్తాల విలువ(దాదాపు రూ.లక్ష) ఉంటుంది. ఈ ఘటన నారాయణపురం కోల్డ్ స్టోరేజ్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని ఎస్ఐ తెలిపారు.



‘జిన్ షిన్ జ్యుషు’ అనేది జపనీస్ ఎనర్జీ హీలింగ్ టెక్నిక్. ఒత్తిడి, ఆందోళన తగ్గించడానికి, సుఖ నిద్రకు ఇది సహాయపడుతుందని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ హీలింగ్ అండ్ కేరింగ్ అధ్యయనం తెలియజేసింది. పడుకోవడానికి కొద్దిసేపు ముందు చేతి బొటనవేలు, కాలి బొటనవేలును కొద్ది నిమిషాల పాటు నొక్కాలని ఇది శరీరాన్ని నిద్రకు సిద్ధం చేయడానికి సహాయపడుతుందని చెబుతోంది జిన్ షిన్.



● ఆస్కార్ ఎంట్రీ

మెరుగైన ఇంటి వైపు

ఈ దేశవాసులకు ఈ దేశమే ఇల్లు. ఇక్కడే ఉండాలి. జీవించాలి. కాని ఈ నేల ప్రతి ఒక్కరికీ నివాసయోగ్యంగా ఉందా? ప్రతి ఒక్కరినీ సమానంగా, గౌరవంగా చూస్తోందా? ఏ మహమ్మారో వస్తే వలస కూలీలను ‘మీ ఊరికి పోండి’ అని సాటి మనుషులే తరిమికొడితే ‘ఇంటి వైపు’ నడక సాగుతుందా? మన హైదరాబాదీ దర్శకుడు నీరజ్ ఘెవాన్ తీసిన ‘హోమ్‌బౌండ్’ ఎన్నో సామాజిక ప్రశ్నలు లేవనెత్తుతోంది. వివక్షలను ప్రశ్నిస్తోంది. భారత దేశం నుంచి ఆస్కార్‌కు ఆఫీషియల్ ఎంట్రీగా ఎంపికైన ఈ సినిమా వివరాలు.

హోమ్‌బౌండ్

మే 21, 2025.

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కనీవినీ ఎరగనట్టుగా స్టాండింగ్ ఒవేషన్ ఇస్తున్నారు ప్రేక్షకులు.

సినిమా అయ్యాక లేచి నిలబడి చప్పట్లు కొడుతున్నారు.

ఒక నిమిషం... రెండు నిమిషాలు... చప్పట్లు ఆగడం లేదు... 9 నిమిషాల పాటు చప్పట్లు మోగుతూనే ఉన్నాయి.

ఆ సినిమాలో నటించిన నటీనటులు, నిర్మాత, దర్శకుడు ఉద్వేగంతో కన్నీరు కారుస్తూ ఒకరిని ఒకరు హత్తుకున్నారు.

బహుశా ఆ చప్పట్ల మోత ‘ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా’ను తాకినట్టున్నాయి. 2026లో జరగనున్న 98వ ఆస్కార్ అవార్డ్స్ పోటీకి ‘బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్’ కేటగిరి కోసం ఇండియా నుంచి అఫీషియల్ ఎంట్రీగా ఆ సినిమాను ఎంపిక చేశారు.

పేరు: హోమ్‌బౌండ్.



నిజ సంఘటన ఆధారంగా...

ఈ సినిమాను నిజ జీవిత సంఘటన ఆధారంగా దర్శకుడు నీరజ్ ఘెవాన్ తీశాడు. 2020లో న్యూయార్క్ టైమ్స్‌లో కశ్మీర్ జర్నలిస్ట్ బషారత్ పీర్ ఒక ఆర్టికల్ రాశాడు. ఒక మిత్రుడి సమాధి పక్కన కూచుని ఉన్న మరో మిత్రుడి ఫొటో వేసి. ‘టేకింగ్ అమృత్ హోమ్’ అనే ఆ ఆర్టికల్ కోవిడ్ కాలంలో సూరత్ ఫ్యాక్టరీల్లో పని చేస్తున్న ఇద్దరు మిత్రులు ఉత్తర్ ప్రదేశ్‌లోని తమ సొంత ఊరుకు బయలుదేరి ఎలా సర్వం కోల్పోయారో. వారిలో ఒక మిత్రుడు చనిపోతే మరో మిత్రుడు కోవిడ్‌కు భయపడకుండా ఆ శవాన్ని ఎలా ఇంటికి చేర్చాడో బషారత్ ఆ ఆర్టికల్‌లో రాశాడు. అది చదివిన నీరజ్ కోవిడ్ సమయాన్ని నేపథ్యంగా ఉంచుతూనే ఈ దేశంలో వ్యాపించిన సామాజిక దుర్నీతులను ముందు వరుసలో పెట్టి ‘హోమ్‌బౌండ్’ను తీశాడు.

అదే దర్శకుడికి అదే గుర్తింపు

‘హోమ్‌బౌండ్’ (ఇంటి వైపు) దర్శకుడు నీరజ్ ఘేవాన్. ఇంతకు ముందు ఇతను తీసిన ‘మసాన్’ సినిమా మన దేశంలోనే కాదు విదేశాల్లో కూడా విపరీతమైన ప్రశంసలు పొందింది. దానికి కారణం ఆ సినిమాలో ఎత్తి చూపించిన వివక్ష, తాత్వికత. ఇప్పుడు కూడా అలాంటి వివక్షను, ఆధిపత్యాన్ని దర్శకుడు గొప్ప కళాత్మకంగా, సెన్సిబుల్‌గా చూపించడం వల్లే ‘హోమ్‌బౌండ్’కు ఘన జేజేలు దక్కుతున్నాయి. హాలీవుడ్ దిగ్గజం మార్టిన్ స్కోర్‌సెసి ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉండటమే కాదు సినిమా విపరీతంగా నచ్చడంతో పొగడ్తలతో ప్రచారంలోకి తెచ్చాడు. ఆ తర్వాత ఫిల్మ్‌ఫెస్టివల్స్‌లో సినిమాకు ప్రశంసలు మొదలయ్యాయి. కాన్స్ తర్వాత టొరెంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో ‘హోమ్‌బౌండ్’ రెండవ స్థానంలో నిలిచింది. ‘మసాన్’ సినిమా సమయంలో కేన్స్‌లో పాల్గొన్న నీరజ్ తిరిగి ఈ సినిమాతో అదే కేన్స్‌లో సగర్వంగా నిలిచాడు.

ఇద్దరు స్నేహితుల కథ

‘హోమ్‌బౌండ్’ షోయెబ్, చందన్ కుమార్ అనే ఇద్దరు మిత్రుల కథ. వీరిద్దరూ అట్టడుగు ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న యువకులు. చిన్నప్పటి నుంచి వీరు పోలీస్ కానిస్టేబుళ్లు అవ్వాలనుకుంటారు. అందుకై ప్రయత్నిస్తూ నగరంలో అంత వరకూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటారు. కాని ఒకసారి ఊరు విడిచి నగరానికి చేరుకున్నాక ప్రపంచపు పోకడ, మన దేశంలో వేళ్లూనుకుని ఉన్న వివక్ష వారికి అనుభవంలోకి వస్తుంది. చందన్ దళితుడైన కారణంగా అవమానాలు ఎదుర్కొంటుంటే, షోయెబ్ ముస్లిం కావడం వల్ల వివక్షను ఎదుర్కొంటూ ఉంటాడు. ఈ ‘దేశం’ అనే ‘ఇల్లు’ వీరికి ‘కొందరికి’ ఇస్తున్నట్టుగా మర్యాద, గౌరవం ఇవ్వడం లేదు. ‘కానిస్టేబుల్ ఉద్యోగం’ వస్తే అన్ని వివక్షలు పోతాయని వీరు అనుకుంటారుగాని అదంతా ఉత్త మాట... కొందరు ఎంత ఎదిగినా కిందకే చూస్తారని కూడా అర్థమవుతుంది. వీరికి పరిచయమైన అమ్మాయి సుధా భారతి అంబేద్కరైట్‌గా సమాజంలో రావలసిన చైతన్యం గురించి మాట్లాడుతుంటుంది. ఈలోపు పులి మీద పిడుగులా లాక్‌డౌన్ వస్తుంది. అక్కడి నుంచి ఆ స్నేహితులిద్దరూ సొంత ఊరికి బయలుదేరడంతో ఆ ప్రయాణం వారిని ఎక్కడికి చేర్చిందనేది కథ. ఇందులో ఇద్దరు స్నేహితులుగా విశాల్ జేత్వా, ఇషాన్ ఖట్టర్ నటించారు. సుధా భారతిగా జాన్వి కపూర్ నటించింది. కరణ్ జొహార్, అదర్ పూనావాలా (కోవీషీల్డ్ తయారీదారు) నిర్మాతలు. సహజమైన పాత్రలు, గాఢమైన సన్నివేశాలు, దర్శకుడు సంధించే ప్రశ్నలు ఈ సినిమా చూశాక ప్రేక్షకులను వెంటాడుతాయని ఇప్పటి వరకూ వస్తున్న రివ్యూలు చెబుతున్నాయి.

ఆస్కార్ నామినేషన్స్‌ను జనవరి 22, 2026న ప్రకటిస్తారు. హోమ్‌బౌండ్ నామినేట్ అవుతుందని ఆశిద్దాం. మరో ఆస్కార్ ఈ సినిమా వల్ల వస్తే అదీ ఘనతే కదా.

నవశక్తి

‘ఆశలు ఉండగానే సరిపోదు ఆశయ సాధనకు కృషి చేయాల్సిందే! అప్పుడే సరైన ఫలితాన్ని సాధించగలం అంటోంది 19 ఏళ్ల కాట్రావత్ అంజలి. సెప్టెంబర్ 1 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్ఠాత్మకమైన ఆలిండియా తాల్ సైనిక్ క్యాంపులో ఉస్మానియా వర్సిటీ సైఫాబాద్ సైన్స్ కాలేజీ విద్యార్థిని, ఎన్‌సిసి క్యాడెట్ అంజలి ఫైరింగ్ విభాగంలో తన ప్రతిభను చూపింది. పతకాలూ సాధించింది. నవ శక్తికి ప్రతీకగా నిలుస్తున్న మహబూబ్‌నగర్ వాసి అంజలి చెబుతున్న విషయాలు ఆమె మాటల్లోనే..



ఫైర్ ముఖ్యం

“మా నాన్న నర్సింహ లారీ డ్రైవర్. అమ్మ దుర్గ గృహిణి. పుట్టిందీ, పెరిగిందీ మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి. ఓయూ సైఫాబాద్ కాలేజీలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. డిగ్రీతో పాటు ఆ కాలేజీలో ఎన్‌సిసిలో సి-సర్టిఫికెట్ చేస్తున్నాను. ఈ యేడాది ఢిల్లీలో జరిగిన టీఎస్సీ (తాల్ సైనిక్ క్యాంప్)లో పాల్గొనే అవకాశం లభించింది. ఇది జాతీయ స్థాయి ఈవెంట్. ఆర్మీ వింగ్‌కి మాత్రమే అవకాశం ఉండే ఈవెంట్ కూడా. ఐయుసి, ఐజీసి, టీ ఆర్జీ.. ఇలా లాంచింగ్ వరకు దశల వారీగా శిక్షణ తీసుకుంటూ, పోటీలో పాల్గొంటూ, సక్సెస్ సాధిస్తేనే టీఎస్సీకి ఎంపిక కాగలం.



ప్రత్యేక శిక్షణ

నేను పాల్గొన్నది ఫైరింగ్ అప్లికేషన్. దీనికి ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ప్రతిరోజూ చేయాల్సిన వ్యాయామాలు, మోటివేషన్ క్లాసులు, ఫైరింగ్‌లో ఏ మోడ్‌పాయింట్ ఎలా తీసుకోవాలనేది శిక్షణలో భాగం. ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఉండే ట్రెనింగ్‌తో పాటు రేంజ్ సెక్షన్ దగ్గర ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి. భుజ బలానికి ప్రత్యేక వ్యాయామాలు ఉంటాయి. స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌ల క్లాసులు ఉంటాయి. మానసికంగా ఒకే విషయంపైన ఏకాగ్రత ఉండేలా శిక్షణ ఇస్తారు. పాయింట్ 22 బోర్ రైఫిల్ బరువు 3-4 కేజీలు ఉంటుంది. దీనిని మోయడమే కాదు, అదే సమయంలో ఫైర్ చేయడానికి చాలా శక్తి కావాలి. ఇందుకోసం బలం పెరిగేలా ఆహార నియమాలు, డిప్స్, పుషప్స్, కోర్‌మజిల్ స్ట్రెంథెనింగ్ .. వంటివి రోజూ సాధన చేస్తూ ఉండాలి.

స్ఫూర్తిని నింపే ఈవెంట్..

జాతీయ స్థాయిలో జరిగే టీఎస్సీలో పాల్గొనడానికి దేశవ్యాప్తంగా ఉన్న 17 డైరెక్టరేట్స్ నుంచి మంచి శిక్షణ తీసుకున్న విద్యార్థులు పాల్గొంటారు. ప్రతి డైరెక్టరేట్ నుంచి 40-50 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారు. ఇందులో మన ప్రాంతం నుంచి నేను పాల్గొనడం చాలా ఆనందాన్నిచ్చింది. జాతీయ స్థాయి శిక్షణ పొందిన విద్యార్థులను కలుసుకోవడం, వారి సంస్కృతి గురించి తెలుసుకోడం, పోటీలో పతకాలు సాధించడమూ చాలా సంతోషాన్నిచ్చింది.

ఆశ .. ఆశయం

చిన్నప్పటి నుంచి పోలీస్ అవ్వాలని, డిఫెన్స్‌లోకి వెళ్లాలనేది నా ఆలోచన. దానికి తగినట్టుగా నాకున్న ఆసక్తిని గమనించి, మా ఎన్సీసీ అసోసియేట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ పల్లటి నరేష్ ఆసక్తి ఉందా అని అడిగారు. నా ఆనందం మాటల్లో చెప్పలేను. నాకు ఇష్టమైన రైఫిల్ ట్రైనింగ్‌లో మిస్ కాకుండా పాల్గొనడం మొదలుపెట్టాను. ఈ ట్రైనింగ్ వల్ల కొన్ని నెలలుగా కాలేజీకి దూరంగా ఉండాల్సి వచ్చింది. క్లాసులు, ల్యాబ్స్ మిస్ అయ్యాను. మా లెక్చరర్స్ సపోర్ట్ ఉండటం మరింత బలాన్నిచ్చింది. ఇప్పుడు ఫైనలియర్ కాబట్టి ట్రైనింగ్ తీసుకుంటున్నాను. స్టేట్ పోలీస్ ట్రైనింగ్‌కి అప్లికేషన్ పెట్టుకున్నాను. సెంట్రల్ డిఫెన్స్‌లో పాల్గొనాలనేది నా ఆశ. అందుకు తగిన ట్రైనింగ్ తీసుకుంటున్నాను” అని ఆనందంగా వివరించింది అంజలి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 22న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,16,410	1,14,500	1,13,070	1,14,500	1,15,200	1,13,020
బంగారం (22 క్యారెట్లు)	1,08,250	1,06,300	1,03,650	1,06,300	1,05,980	1,03,600
వెండి	1,39,000	1,36,400	1,48,000	1,36,400	1,37,000	1,48,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సేంద్రియ ఉత్పాదకాలపై ఎన్ఐపీహెచ్ఎంలో శిక్షణ

ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంలో ఉపయోగించే అనేక బయో ఉత్పాదకాల (బయో ఇన్‌పుట్స్)ను పొలాల్లోనే తయారు చేసుకొని, పంటలకు వినియోగించుకునే పద్ధతులపై హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కేంద్ర వ్యవసాయ శాఖకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) 3 రోజుల శిక్షణ ఇవ్వనుంది. అక్టోబర్ 13 నుంచి 15 వరకు జరిగే ఈ శిక్షణను తెలుగు, ఇంగ్లిష్, హిందీలలో బోధిస్తారు. జీవన ఎరువులు, జీవన పురుగుమందులు, ఘన/ద్రవ జీవామృతం, కషాయాలు, ద్రావణాల తయారీతో పాటు మిత్రపురుగులను క్షేత్రస్థాయిలో పెంపొందించుకునే పద్ధతులు నేర్పిస్తారు. 30-40 మందికి అవకాశం. రైతులు, ఎఫ్‌పీవోల సభ్యులు, గ్రామీణ యువతీయువకులు ఈ శిక్షణకు అర్హులు. శిక్షణ రుసుము, వసతి, భోజన ఖర్చులన్నీ కలిపి ఒకరికి రూ. 4,185లు. ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై లోతైన అవగాహన పెంచుకోవాలనుకునే యువతకు ఈ శిక్షణ ఉపయోగకరం.

ఇతర వివరాలకు.. డా. బి. శైలజ - 96667 21672.
Email: dirphmniphm-ap@nic.in

26, 27 తేదీల్లో కిసాన్ మహోత్సవం

ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ ఆవరణలో కిసాన్ మహోత్సవం జరగనుంది. అధునాతన వ్యవసాయ పద్ధతులు, పోకడలపై ఎగ్జిబిషన్, సదస్సులు, చర్చా గోష్ఠులు నిర్వహిస్తారు. 2023, 2024 వార్షిక వ్యవసాయ పురస్కారాలు ప్రదానం చేస్తారు.

ప్రవేశం ఉచితం. ఇతర వివరాలకు.. 70757 51969

అధిక దిగుబడినిచ్చే మిల్కీ మష్రూమ్



భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలికి అనుబంధంగా ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ మష్రూమ్ రీసెర్చ్ అధిక దిగుబడినిచ్చే డీఎంఆర్ మిల్కీ-299 అనే కొత్త పుట్టగొడుగుల రకాన్ని అభివృద్ధి చేసింది. ఈ రకం పుట్టగొడుగులు గది ఉష్ణోగ్రతలో 7 రోజులు, ఫ్రిడ్జ్‌లో 15 రోజుల వరకు నిల్వ ఉంటాయని ఐసీఏఆర్ తెలిపింది. విస్తృతంగా సాగులో ఉన్న డీఎంఆర్‌సీ-985 రకంతో పోల్చితే ఇది 14.5% అధిక దిగుబడినిస్తుంది. దేశీ జన్యువనరులతో ఆధునిక బ్రీడింగ్ పద్ధతుల ద్వారా తయారైన ఈ రకం పుట్టగొడుగుల పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఐసీఏఆర్ తెలిపింది. బటన్ మష్రూమ్స్ పెంపకంలో మాదిరిగా నియంత్రిత వాతావరణం కోసం ఖరీదైన ప్రత్యేక మౌలిక సదుపాయాలు దీనికి అవసరం లేదు. స్వల్పఖర్చుతో కూడిన షెడ్లలోనూ 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వరకు పెంచవచ్చని చెబుతున్నారు.

సాగుబడి
ఉత్తర కార్తె: సెప్టెంబర్ 26 వరకు
హస్త కార్తె: 27 నుంచి

సాంప్రదాయ పంటలు పండించే చాలా మంది రైతుల నికరాదాయం ఎకరానికి రూ.20 వేలకు మించటం లేదు. పత్తి, మొక్కజొన్నకు బదులుగా మునగ సాగు చేస్తే సన్న, చిన్నకారు రైతుల నికరాదాయం పెరుగుతుంది. 3 సంవత్సరాలలోపు ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూడా మునగను సాగు చేసుకోవచ్చు. వాతావరణ ఒడిదుడుగులను తట్టుకోవటానికి మునగ దోహద పడుతుంది. నాటిన 7-8 నెలల్లో తొలి పంట కోతకు వస్తుంది. మూడేళ్లలో వరుసగా కనీసం 5 కార్శి పంటలు తీసుకోవచ్చు. మునగ ఆకుల పొడి, గింజల ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి. భరత్, ఉద్యాన శాస్త్రవేత్త బి. శివ, విస్తరణ శాస్త్రవేత్త డా. ఎన్. హేమ శరత్ చంద్ర మునగ సాగుపై అందించిన పూర్తి వివరాలు.



మునగ మేలు!







మునగ ఒక్కసారి నాటితే మూడేళ్ల పాటు మునగ కాయల దిగుబడి
ఎకరానికి వెయ్యి మొక్కలు.. మొక్కకు 150 కాయలు..
మునగాకు, గింజల ద్వారా అదనపు ఆదాయం
ఏడాదికి ఎకరానికి రూ.75 వేల ఆదాయం వస్తుందంటున్న శాస్త్రవేత్తలు

పోషకాల గనిగా పేరు తెచ్చుకున్న మునగ రైతుల పాలిట కల్పవృక్షంగా విరాజిల్లుతున్నది. తినే వారికి ఆరోగ్యం, పండించే వారికి లాభాలు అందిస్తోంది. తక్కువ పెట్టుబడితోనే అధిక దిగుబడులందిస్తూ.. అన్నదాతల ఇంట సిరులు కురిపిస్తున్నది. మునగ చెట్టులో ప్రతీ భాగం ఉపయోగకరమైనదే. ఆకులు, కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటి విత్తనాలను ఔషధ పరిశ్రమలలో వాడతారు. అందుకే, వీటికి మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంటుంది. ఆరోగ్యపరంగానే కాకుండా, వ్యాపారపరంగానూ మునగను సాగు చేసేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

ఏ నేలలైనా ఓకే

అన్ని రకాల నేలల్లో మునగను సాగు చేసుకోవచ్చు. ఉదజని సూచిక 6.5-8 శాతం ఉండే ఇసుక రేగడి నేలలు ఎక్కువ అనుకూలంగా ఉంటాయి. నీరు నిలవని ఎర్ర, ఇసుక, ఒండ్రు నేలలు అనుకూలమైనవి. నీటి వసతి గల సారవంతమైన భూముల్లో అధిక దిగుబడి సాధించవచ్చు. ఆరు నెలల్లోనే కాతకు వచ్చే ఏకవార్షిక రకాలు అందుబాటులోకి వచ్చాయి.

అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు

మునగ విత్తనంతో మొక్కలు పెంచి, నాటుకోవాలి. జూలై నుంచి అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు. ఏ సమయంలో విత్తినా వేసవిలోనే (జనవరి-ఏప్రిల్ మధ్యలో) పూతకు వస్తుంది. ఫిబ్రవరిలో ఎక్కువ పూత, కాత ఉంటుంది. ఒక ఎకరానికి వెయ్యి మొక్కలు నాటాలి. మొక్కలను ముందుగా నర్సరీల్లో పెంచాలి. పీకేఎం-1 మునగ రకం విత్తుకోవటం మేలు. పాలిథిన్ సంచుల్లో విత్తిన 15 రోజుల్లో మొలక వస్తుంది. మొక్కల మధ్య 1 మీ., వరుసల మధ్య 1.5 మీ. దూరంలో గుంతలు తీసుకోవాలి. అర ట్రక్కు పశువుల ఎరువుకు రెండు బస్తాల వేపపిండి, 10 కేజీల ట్రైకోడెర్మా కలపాలి. దీన్ని ప్రతి గుంతకు రెండు దోసెళ్లు (ఒక కిలో), గుప్పెడు సూపర్ ఫాస్ఫేట్ వేయాలి. ప్రతి మొక్కకూ డ్రిప్ ద్వారా 135: 23: 45 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను అందిస్తే దిగుబడులు పెరుగుతాయి. నత్రజని, పొటాష్ ఎరువులను యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో డ్రిప్ ద్వారా అందించాలి. డ్రిప్ ద్వారా 10-15 లీ. నీరివ్వాలి. నాటిన తర్వాత 3, 6 నెలలకు నత్రజని ఎరువు వేయాలి. వాస్తవానికి మునగ మొక్కలకు ఎక్కువ ఎరువులు అవసరం ఉండదు. జీవన ఎరువులు కూడా వాడితే నేల సారం, నేల ఆరోగ్యం పెరిగి తెగుళ్ళు రాకుండా ఉంటాయి.



బొంత పురుగులతో జాగ్రత్త

మునగ కాండంపై బొంత పురుగులు గుంపులుగా చేరి, బెరడును తొలిచి తింటాయి. ఆకులను తొలిచేస్తాయి. దీంతో ఆకు విపరీతంగా రాలిపోతుంది. ఈ సమయంలో పురుగు గుడ్లను, లార్వాలను ఏరివేయాలి. వర్షాల తర్వాత పెద్ద పురుగులను నివారించడానికి హెక్టారుకు ఒక దీపపు ఎరను ఉంచాలి. వేపనూనె మందు ద్రావణం పిచికారీ చేస్తే మొక్కలపై పురుగులకు వికర్షకాలుగా పనిచేస్తాయి.

ఈ పంటలతో మునగను కలపొద్దు

ఆయిల్ పామ్, పత్తి, కూరగాయ పంటల్లో అంతర పంటగా వేస్తే మునగ మొక్కలు ఎరువులు, నీరు ఎక్కువగా అంది చాలా ఏపుగా పెరుగుతాయి. కానీ, పూలు, కాయలు ఆలస్యంగా రావడం స్పష్టంగా గుర్తించాం. కాబట్టి, అంతర పంటగా వేసినప్పుడు మునగ మొక్కలకు ఎక్కువ నీరు, ఎరువులు అందకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ చీడపీడలు ఆశించే టమాటా, వంగ, మిర్చి పంటలను మునగలో అంతర పంటలుగా వేసుకోకూడదు. ఎరువులు, సస్యరక్షణ చర్యలు తక్కువ అవసరమయ్యే కూరగాయ పంటలను మాత్రమే వేసుకోవాలి. లేకపోతే మునగ దిగుబడి తగ్గిపోతుంది. పొలంలో మురుగు నీరు చేరకుండా చూసుకోవాలి.

కత్తిరించిన 4-5 నెలల్లో మళ్లీ కాపు

మునగ నాటిన మొదట్లో ప్రతి 2 నెలలకోసారి (6 నెలల్లో 3 సార్లు) విధిగా కొమ్మలు కత్తిరిస్తే.. కొమ్మలు గుబురుగా వచ్చి పూత, కాయల దిగుబడి ఎక్కువగా వస్తుంది. పక్క కొమ్మలు రాకుండా ఏపుగా బాగా ఎత్తు పెరిగితే పూత సరిగ్గా రాదు. భారీ వర్షాలు, ఈదురు గాలులకు మొక్కలు పక్కకు పడిపోయి విరిగిపోతాయి. మొదటి కాయ కోత తర్వాత భూమట్టం నుంచి 90 సెం.మీ. ఎత్తులో మొక్క కాండం, కొమ్మలను కత్తిరించాలి. దీంతో 4-5 నెలల్లో చెట్టు మళ్లీ కాపు కొస్తుంది. మూడు సంవత్సరాల వరకు ఇలా 4-5 నెలలకొకసారి కార్శి పంటలను తీసుకోవచ్చు. కత్తిరించిన వెంటనే మొక్కకు 45, 15,30గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. 30 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. ఏటా 25 కిలోల చొప్పున బాగా చివికిన పశువుల ఎరువు వేయాలి.

ఎకరానికి ఉత్పాదకాల ఖర్చెంత?

కావలసినవి	ఖర్చు (రూ.)
1 కేజీ విత్తనం	2,000
1,000 పాలిథీన్ సంచులు	1,294
సగం ట్రాక్టర్ ట్రక్కు మట్టి, ఇసుక	600
ఒక ట్రాక్టర్ ట్రక్కు పశువుల ఎరువు	2,500
100 కేజీల వేప పిండి	1,500
6 కేజీల ట్రైకోడెర్మా జీవన ఎరువు	600
4 లీటర్ల వేప నూనె	2,400
40 కేజీల జిప్సం	400
4 బస్తాల యూరియా	1,070
2 బస్తాల పొటాష్	3,000
5 బస్తాల సూపర్ ఫాస్ఫేట్	1,810
అర లీటరు రీజెంట్	400
దీపపు ఎరలు	300
సాగు ఖర్చు (కౌలు/దుక్కి/కూలి మినహా)	17,874

మొక్కకు 150 కాయలు

ఒక ఎకరానికి 1,000 మొక్కలు నాటితే ప్రతి మొక్కకు కనీసం 150 కాయల చొప్పున 1,50,000 కాయలు కాస్తాయి. రూపాయికి 2 కాయల చొప్పున (ఒక కేజీకి రూ.5) స్థానికంగా అమ్మితే.. ఎకరానికి ఏడాదికి రూ.75,000 ఆదాయం వస్తుంది. మునగ ఆకులను కోసి ఎండ బెట్టి పొడి చేసి అమ్ముకోవచ్చు. మునగ గింజలు/నూనె ద్వారా అదనపు ఆదాయం వస్తుంది.

మునగ ప్రకృతి సేద్యం ఇలా..

మునగ పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే ఖర్చులు తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడి, మంచి దిగుబడులు వస్తాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతి మునగ సాగుకు బాగా అనుకూలం. భూమిని లోతుగా దున్ని సూర్య కాంతికి ఎండబెట్టాలి. గోతులు తవ్వి, ఎండిన ఆకుల చెత్త, పశువుల ఎరువు, ఘనజీవామృతం లేదా వర్మీ కంపోస్ట్ కలిపి గోతులను నింపాలి. సేంద్రియంగా సాగు చేసిన విత్తనాలను మాత్రమే వాడాలి. విత్తనాలను బీజామృతంలో శుద్ధి చేసిన 24 గంటల తర్వాత విత్తాలి. మొక్కలకు జీవామృతం లేదా గోమూత్ర ద్రావణం వాడాలి. ద్రవ జీవామృతాన్ని 15 రోజులకు ఒకసారి ఇస్తూ ఉండాలి. డ్రిప్ ద్వారా నీరివ్వాలి. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వేపనూనె, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కషాయాలను తయారు చేసి పిచికారీ చేయాలి. పచ్చి రొట్ట పంటలను పెంచి, కత్తిరించి, మొక్కల మొదళ్ల చుట్టూ మల్చింగ్‌గా వెయ్యాలి. కలుపు సమస్య తగ్గుతుంది. ఉత్పత్తి ఖర్చు 30-40% తగ్గుతుంది. ప్రకృతి వ్యవసాయంలో పండించిన మునగ కాయలు రుచిగా, పోషకాలు అధికంగా ఉండి, ఎగుమతులకు అనుకూలంగా ఉంటాయి.

ఇతర వివరాలకు.. డా. టి. భరత్ - 97005 49754